# జాతివైరం

'ఆడాళ్ళబండీలో ఎక్కరమ్మంటే మొగాళ్ళబండీలో ఎక్కివచ్చావేం-ఏమిటీ సాహసం?'

'మొగాళ్లబండీలో రాబట్టే జాగ్రత్తగా మీవద్దకు రాగలిగాను. ఆడాళ్లబండీలోకి ఎక్కితే నన్నూ పిల్లల్నీ చూసేయోగం మీకు లేకపోను—'

'ఏమిటీ ఈ వింత సంజాయిషీ?'

'ఆడాళ్ళకు ఆడాళ్ళబండీలో తగినంత రక్షణలేదు...'

'ఆడవాళ్లబండీలో మొగవాళ్లుండరు, ఆడవాళ్ళే వుంటారు - అదే కావలసినంత రక్షణ...'

'మీరు పొరబాటుపడుతున్నారు - ఆడవాళ్లు ఆడవాళ్లకు జాగా యివ్వరు-'

'అసూయా?'

'అంతకన్నా ఎక్కువదే - వున్నపాళంగా బండీలోంచి కిందకు తోసేస్తారు. మొగాళ్లబండీలో అయితే...'

'కళ్ల కద్దుకుంటారా?'

'అదేమో నాకు తెలీదు-కూర్చుందుకేనా జాగా యివ్వకపోరు ఆడదానికి.''

'కూర్చోగానే సరా? జాగ్రత్తో?'

'కావలసినంత జాగ్రత్త! అంతమంది మొగాళ్ల మధ్య ఆడదానికి-వంటరిగా ప్రయాణంచేసే ఆడదానికి ఏ అన్యాయమూ జరగదు.'

'తమాషాగా వుంది నువ్వు చెప్పేది!'

'ఆడవాళ్లకు అన్యాయం చేయదలుచుకున్న మొగాళ్లు మొగాళ్ల బండీలో ఎక్కరు-అర్ధరాత్రివేళ ఆడాళ్ళబండీలోకి జొరబడతారు.'

'నువ్వు ఎలా కనిపెట్టగలిగావు ఈ సంగతి?'

'మీ చెల్లెలు చెప్పింది-నిన్నరాత్రి మెయిలుకు వచ్చేటప్పుడు. ఆడవాళ్ళబండీలో ఎక్కనని చెప్పి నాచేత ఒట్టు వేయించుకుంది-ఆ మధ్య ఆవిడ తన అత్తారింటినుంచి వచ్చేటప్పుడు ఆడాళ్ళ బండీలో ఎక్కిందట రాత్రివేళ.'

'ఏం జరిగిందప్పుడు?'

'ఎవడో ఎక్కడట రాత్రి రెండుగంటలప్పుడు-'

'ఎక్క ఏంచేశాడూ?'

'ఏం చేస్తాడూ? అందరి మెడలూ తడమడం ప్రారంభించాట్ట. అంతా కిక్కురుమనకుండా తడిమించుకుని వూరుకున్నారు-'

'మా చెల్లాయినా?'

'మీ చెల్లాయి దగ్గరికికూడా అతడు వస్తూండేటప్పటికి ఏదో స్టేషను వచ్చి రైలు ఆగబోతూంటే అతడు దూకేసి పారి పోయాట్ట-'

'మా చెల్లాయి రాయలేదే నాకు ఈ సంగతి?'

'ఎలా రాస్తుందీ, సిగ్గుకాదూ?'

'అంచేత నువ్వు ఆడవాళ్ళబండిలో ఎక్క లేదంటావా?'

'అంచేతే కాదు-మెడలు తడిమేవాళ్ళు రోజూరారు. కాని,ఆడవాళ్ళు ఇతర ఆడవాళ్లను పెట్టే యిబ్బందులు-'

'అంటే?'

'నిన్న ఒకావిడ కొవ్వూరుస్టేషనులో ఆడాళ్ళ పెట్టిలో ఎక్కిందట. నిడదవోలు స్టేషన్ వచ్చేసరికి పెట్టెలో సామానూ తనూ, పిల్లలూ అంతా నే నెక్కిన మొగాళ్లబండిలోకే వచ్చి పడ్డారు!'

'ఏం?'

'ఆడాళ్ళ పెట్టెలో జాగాలేక?'

'సర్దుకు కూచోలేక పోయిందా?'

'అంగుళం చోటేనా యివ్వలేదట తోటి ఆడవాళ్లు - పసి పిల్లాణ్ని పడుకో బెట్టడానికికూడా చోటు దొరకలేదట-పోనీ పిల్లాణ్ణి ఎత్తుకు నించుంటానంటే నించోడానికిమాత్రం నీకు చోటెవరిస్తారు-పై స్టేషన్లో దిగి ఇంకోబండిలో ఎక్కు-అన్నారట-

'పాపం!'

'ఈ కథంతా ఏడుస్తూ చెప్పి నేను ఎక్కిన బండిలోకివచ్చి నాపక్కన కూర్చోడానికి సిద్ధపడింది.'

'నువ్వుమాత్రం చోటిచ్చావా?'

'నేనుమాత్రం చోటిచ్చానా? ఎదురుబల్లమీద కూచున్న మరో మొగాడు లేచి కూర్చోండమ్మా!!!' అని అన్నాడు ఆవిడతో.